# ★ క్షమాపణ ★

## ★ 'పూర్ణపత్రి' ★

ఉపన్యాసకుడు సంఘసుధారకత్వాన్ని గురించి స్వీయానుభవాన్ని ఉపన్యాసరూపకంగా వెడలగ్రక్కుతుంటే—

ఉపన్యాసాగ్నికి ఉడికి ఉద్రేకంజెందిన సభికులంతా "హాయ్ హాయ్ వాహ్‌వాహ్" అంటూ సంతోషాతిశయాన్ని వెలిబుచ్చుతుంటే—

నాప్రక్కనున్న పద్మనాభంమటుకు కరకుహృదయంతో ఉపన్యాసకుని ప్రతివాక్యాన్ని విమర్శిస్తూ—

పైన

అతి శ్రద్ధగా ప్రతివిషయాన్ని నోట్ చేసుకుంటున్న నన్ను "పాపం. ప్రకాశంగారికి తీరికేలేదే. రేపటి తమ కేసరిపత్రికలో మాబోంట్ల వ్యాసాలకు చోటే ఉండదు గామోసు" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించటం నాకు మరీ చిరాకేసింది? యేం చేసేది?

అది అతని స్వభావం.

నిరుత్తరమే అతని ప్రశ్నకు సరియైన జవాబని తోచింది.

యింతలో కొంతకాలం గడిచింది.

కాని

ఉపన్యాసవేగానికి కాలచక్రం యెంతముందు కెళ్ళిందో యెవరూ గమనించలే. తుట్టతుదకు 'పట్టభద్రులగు యీ విమలేంద్రబోసుగారు ఆగర్భశ్రీమంతులైగూడా ప్రజలకోసం యిట్లు కష్టనిష్ఠురములు సహిస్తూ ప్రచారం చేయడం చాలా ప్రశంసనీయం' అంటూ ఉపన్యాసకుని స్తుతిస్తున్న అధ్యక్షుని ప్రశంసావాక్యాలతో ప్రజల జయజయధ్వానాలతో సభ ముగిసింది.

లేచి వెనుదిరిగాను.

'అతగాణ్ణిగురించి యేమిటి నీయభిప్రాయం' అని ప్రక్కనే ఉన్న పద్మనాభం ప్రశ్నించాడు.

'మంచి ఉపన్యాసకుడు. చాలా అనుభవంగూడా సంపాదించాడు' అని మరి నీయభిప్రాయమో? అన్నాను నేను.

'వీడా? వట్టి ఫూలిష్. అక్కడక్కడ విన్న రెండు ముక్కలు యిక్కడ గబగబ కక్కేశాడు. అంతే. మరేం లేదు. గాడిద పులితోలు కప్పుకున్నట్టున్న దీక్షని వేషం' అన్నాడు పద్మనాభం.

అతని సంభాషణకు కొంచెం అసహ్యంచెంది 'ముఖమాలిన్యం అద్దంలో ప్రతిఫలించినట్టు భావించొచ్చా?' అని నేననేసరికి 'తొందరెందుకు. యెవరిభావం మార్చుకోవాలో నీకే తెలుస్తుంది కొద్దికాలంలో. పద. పాపం ఉపన్యాసకుని గుణగానాలతో పత్రిక నింపించుకోవాలిగామోసు. కాని ఒక్కమాట కారణంలేందేమటుకు విమర్శించి మాట్లాడనను విషయంమటుకు గుర్తించుకో' అని వెనుదిరిగాడు పద్మనాభం.

★

నాటినుండి విమలేంద్రబోసు తరుచుగా ఉపన్యాసాలిస్తూ ప్రచారం చేయసాగాడు. కొంచం సన్నగా పొడుగ్గా ఖద్దరువేషంతో మునిగిన అతని శరీరం ప్రతివాడిని ఆకర్షించటానికి ముఖ్యసాధనంగా ఉండేది. అతనెదుట ప్రతివారు అదొక విధమైన భయం గౌరవం ప్రకటిస్తుండేవాళ్లు. అతనిప్రక్క నుండటమంటే ప్రతివ్యక్తికీ గొప్ప సర్దాగా ఉండేది. నామటుకు నేను ఆ ఉపన్యాసకుని గుణగానానికోసం ప్రతిరోజూ కేసరి పత్రికలో పూర్తిగా ఒక పేజీ వినియోగించేవాడిని. మొత్తంమీద రోజుకొక్కతూరైనా అతని దర్శనం చేయందేమటుకు తోచేదికాదు.

కాని

పద్మనాభం మటుకు అగపడ్డప్పుడల్లా అతనిని గురించి వితండవాదం చేస్తూనే ఉండేవాడు. అతడిని ఒక వేషధారిగా నీచుణ్ణిగా ఋజువు చెయ్యాలని అతనిపట్టుదల. అతనూ చురుకైనవాడే. నేనెరిగి నంతలో అతని విమర్శలు యెదురు సమాధానం తినటం యెప్పుడూ చూడలే. అందుకనే గామోసు కొంచెం పట్టుబట్టి యీ విషయంలో యెదురొచ్చేసరికి నాచేతనే తనవాదన నిజమనిపించాలని అతను ప్రయత్నించడం మొదలెట్టాడు.

★

కొన్ని దినాలు గడచాయి.

పద్మనాభం కనుపడీ షుమారు పదిరోజు లయింది, అలవాటుపడిన ఘటం గనుక అగుపడక పొయ్యేసరికి యేం తోచక 'అరేయ్ సుబ్బులు.పద్మనాభం గారెక్కడి కెళ్లారో కనుక్కరావోయ్'అని మావాడిని కేక వేశాను. నేనేసిన కేకకు మా సుబ్బులుకు బదులు 'హలో మిస్టర్ గుడ్ మార్నింగ్' అంటూ హఠాత్తుగా పద్మనాభమే. ప్రత్యక్షమయ్యాడు. అతని రాకకు ఆశ్చర్యంజెంది 'ఓహో చిరకాల దర్శనమే బ్రదర్' అన్నాను నేను.

'ఆహా బహుకాలం జ్ఞాపకముండేటట్టు శ్రమపెట్టావు భాయ్' అంటూ నా యెదుట కుర్చీలో కూర్చున్నాడు పద్మనాభం.

యేం? అని అతనిమాట అర్థంగాక నే ప్రశ్నించేసరికి 'యేమా? నా వాదాన్ని ఋజువుచేసుకొని నీచేత ఒప్పించటానికి ఉపన్యాసకుని జన్మస్థలాని కెళ్లి రావాలి సొచ్చింది ప్రకాశం. చూడు. యీ రోజుల్లో యీలా బయలు వెడలే ప్రచారకులను పూర్తిగా విశ్వసించటానికి వీల్లేదోయ్. పదవులకోసం కొందరు పేరు ప్రతిష్ఠల కోసం కొందరు చేసిన నేరాలను కప్పి పుచ్చుకోటానికి కొందరు యీలా లెక్చర్లిస్తూ బయలుదేరుతుంటారు. వారికి నీబోటి పత్రికాధిపతులు సహాయమైతే చెప్పే దేముంది? అనుకున్న దానికంటె వారికి యెక్కువ ఫలితమే లభిస్తుంది' అన్నాడు పద్మనాభం.

కొంచం వికలహృదయంతో 'అయితే పొరబడ్డానా?' అన్నాను నేను.

'ఆహా! మొదటిరోజే చెప్పలేదోయ్ వీడొట్టి ఫూలిష్ అని. యీనాడు ఋజువు చెయ్యటానికికూడా సంసిద్ధం' అని అతననేసరికి—

'ఆధారరహితమైన సాక్ష్యాలు అంతులేని ఊహలు పనికిరావు సుమా' అన్నాను నేను. ఆ మాటకు నవ్వి 'కావాలంటే నీయెదుట అతనిచేతనే ఒప్పిస్తానోయ్. సాయంకాలం పార్కులోకి వెంటబెట్టుకరా, అక్కడే జరిగిద్దాము తతంగమంతా' అంటూ 'ఇంటి కెళ్లాలోయ్' అని లేచాడు పద్మనాభం.

*

నాటిసాయంకాలం పార్కులో—

పద్మనాభం చల్లగాలికి లేస్తున్న క్రాపును సర్దుకుంటూ ఉపన్యాసకుని జూచి 'నేను షుమారు రెండు సంవత్సరాలక్రింద అలహాబాదు వెళ్లినప్పుడు అచ్చటి సబ్ జైల్లో అచ్చం మీలాగాయున్న యువకుణ్ణొకణ్ణి చూసినట్టు జ్ఞాపకం. పోలికల్లోగూడా యేంతేడా లేనట్టుంది. మీరేవారా? లేక మీ కుటుంబంలోవారా?' అని ప్రశ్నించాడు. అంతమటుకు కళకళలాడుతున్న అతనిముఖం యీమాట వినేసరికి తెల్లనైపోయింది. అయినా అతను ఆభావాన్ని వెలువడనీయక 'యెబ్బే, అతనెవరో! తెలియదండీ. నేనప్పుడు బెనారస్‌లో బి.ఎ. చదువుతున్నాను' అని సమాధాన మిచ్చేసరికి పద్మనాభం ఒక్కనవ్వునవ్వి 'యేమి? మీరప్పుడు బెనారస్‌లో బి.ఎ. చదువుతున్నారుగా! పాపం. మిమ్మల్ని అరెస్టు చేయటానికి పూర్వం మీ హైస్కూలు హెడ్‌మాస్టరుగారు పోలీసువారికిచ్చిన స్టేట్‌మెంట్ తమకు గుర్తులేదు గామోసు. ఇంద చిత్తగించండి' అంటూ పద్మనాభం ఒక కాగితాన్ని అతనిముందు పారవేశాడు. యీ మాట వినేసరికి పాపం ఉపన్యాసకుడు స్తబ్ధుడయ్యాడు. అతనికి ఆ కాగితాన్నందుకునే శక్తి లేకపోయింది. దాన్ని నేనందుకొని చదివాను. అందు విమలేంద్రబోసు ఫోర్తుఫారము తప్పినాడని అతను స్కూలులో చదివినన్నాళ్లు రౌడీగా ప్రవర్తించి పిల్లల పుస్తకాలు మొదలగునవి దొంగిలించినందుకు అనేకమార్లు శిక్షింపబడ్డారని రాశుంది. నాకు చాలా ఆశ్చర్యంగలిగి ఇట్టి యోగ్యుడు అట్టి పని చేసి ఉంటాడని నమ్మలేక 'అతనే యితనంటానికి ఋజువేముంది. ఆ విమలేంద్రబోసు ఉంకొకడు కాగూడదా?' అని ప్రశ్నించాను. యీ ప్రశ్నకు పద్మనాభం కొంచం కోపంగా 'అబ్బ. నీతో చచ్చే రోజొచ్చిందోయ్ నీకోసమే యింత శ్రమపడాలి సొచ్చింది. యితను శిక్షింపబడ్డాక గుర్తింపుకోసం పోలీసువారు జైలు డ్రస్సుతోనున్న యీతనిని తీయించిన ఫోటో యిదిగో. చూడు. అవతలిపక్కనే యీతని వ్రేలిముద్రలుగూడావున్నాయి' అని నాముందు రెండు బొమ్మలు విశిరివేశాడు. పద్మనాభం తెచ్చిన ఫోటో యీ ఉపన్యాసకుని దంటానికి యేంసందేహం లేదు. పాపం యిదంతా చూసి ఉపన్యాసకుడు గాభరాజెంది వణకటం మొదలెట్టాడు. అతను నావైపు చూడలేక పద్మనాభం దిక్కై 'బాబు క్షమించాలి. అదంతా సహవాస ఫలితం. మీ రీవిషయం నలుగురెదుటా వెల్లడిస్తే నా బజావు దక్కదు. జీవనం పోతుంది' అని బ్రతిమాలసాగాడు. నాకూ జాలేసింది. 'అరేయ్ పద్మనాభం అక్కడనుంచి యితని ప్రవర్తన

చాల బాగుంది గనుక వదిలేయటం ధర్మం' అని నేననే సరికి పద్మనాభం కొంచం ఉగ్రంగా 'ఓహో నీకింకా పూర్వాభిమానం పోనట్టుందే. నీవన్నట్టు ఆ విషయం అంతటితోసమాప్తమైతే చాల బాగుండేది. యీ మహానుభావుడు శిక్ష అనుభవించాక కొంతకాలానికి ఇంటిపక్కనున్న ఒక పెద్ద మనుష్యుని కూతుర్ని కొంతధనంలో బలవంతంగా లేవదీసి కెళ్ళాడు చూడు. యీవిషయం యీ పత్రికలో ప్రకటించబడ్డది. 'పోనీ మనెదుట యీతని ప్రవర్తన చాల బాగుంది. ఆ విషయాలన్నీ మనం చూడలేదు గనుక గౌరవించాలంటావేమో నీవు' అదీ వట్టిదే. యీతని సత్ప్రవర్తనంతా అస్తమానంతో సరి. యిదివరకు యితను రత్నాబాయింటి కెళ్లుతుండడం అనేక సార్లు చూశాను. కాని మొదట్లో సందేహించలే. దాని దురుద్యోగం మాన్పించటాని కేమైనా ప్రయత్నిస్తున్నాడేమో ననుకున్నాను. రాత్రితో యీరహస్యం కాస్తా బయటబడింది. రాత్రి దానింట్లో చీట్లాటాడి యీతను మా ఇంటిపక్కనున్న రామస్వామికి తాకట్టుపెట్టిన గడియారం యిదిగో. నిన్నటివరకు నిజదేవతగ భావిస్తున్న యీతని నిజచరిత్ర విన్నావు గద. మొదటిరోజే చెప్పాను. కాని నీవు వినలేదు. ఇహ నీయిష్టం' అని నాముందు ఒక పత్రిక గడియారంపడేసి తాను లేచాడు. యిన్ని వ్యత్యస్త విషయాలు ఒక్కమారు సప్రమాణకంగా వినేసరికి సంబంధంలేని నాకే హృదయం చెదరిపోయిందంటే పాపం ఇహ ఆ ఉపన్యాసకుని విషయం యేం చెప్పేది. అంతవరకు అతని ముఖంలో పొంగి పొరలివస్తుండే ఉద్రేకము ఉత్సాహము మాయమయ్యాయి. అతను చెదరిన మెదడుతో పిచ్చివాడిలాగా లేచి శక్తిలేక పద్మనాభం కాళ్లమీద బడ్డాడు. అంతవరకు హావభావాలతో నిండిన అతని శరీరం కరుడుగట్టి మంచుగడ్డలాగా చల్లనైంది. అతని కళ్లవెంట కారిన కన్నీటికి పద్మనాభం రెండుపాదాలు తడిసి పోయాయి. అతను విడివడని పెదవుల మధ్యనుండి 'క్ష-మా-ప-ణ' అను అక్షరాలను బలవంతంగా అస్ఫుటంగా వెలువడించి కళ్లు మూశాడు. అస్ఫుటంగా అతని నోటి వెంట వెలువడ్డ ఆ వాక్యానికి ప్రకృతంతా 'క్షమాపణ క్షమాపణ' అంటూ విపరీతధ్వనితో ప్రతిధ్వనించినట్లైంది.


ఆరోగ్యసుధ

సమస్త సెగ సవాయి వ్యాధులకు

20 సంవత్సరములనుండి మా అనుభవములో నున్నది.

సెగవ్యాధులు జీర్ణించుట, సవాయివ్యాధులు జీర్ణించుట, చర్మదోషములు, మూత్రనాళమునందలి మంట, మూత్రము సన్నముగవచ్చుట, కీళ్ళనొప్పులు, ఉపుసువ్యాధులు, శుక్లనష్టము మొదలగువానికి దివ్యామృతము,

సుమారు 1 నెలకు 1 తులం రు 4.

స్త్రీసుధ

స్త్రీల సమస్త వ్యాధులకు

20 సంవత్సరములనుండి మా అనుభవములో నున్నది.

మైల సరిగ కాకుండుట
బుతుశూల
తెలుపుబట్ట
మైల అధికముగా అగుట
మొదలగు వానికి

1 నెలకు 1 తులం రు 3.

N.B:—ఇంకను 250 రకముల ఔషధములును, మరికొన్ని అనుభూతమందులును, మాచే రచింపబడిన ప్రసిద్ధములగు ఆయుర్వేదగ్రంథములును మావద్ద దొరకును.

డాక్టర్ శ్రీపాద
కృష్ణమూర్తిశాస్త్రి
బెజవాడ.

మా అనుభూతమందులకును మాగ్రంథములకును ప్రసిద్ధమగు ప్రతి షాపులోను అడుగవలయును.